స్వల్పంగా పెరిగిన పత్తి ధర



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత పది రోజులుగా పతనమైన పత్తి ధరల్లో మళ్లీ కద లిక వచ్చింది. శుక్రవారం పత్తి ధర క్వింటాకు రూ.200 పైగా పెరిగింది. స్వల్పంగానే ధర పెరిగినా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దూది గింజల ధరలు కొద్దిగా పెరగడంతో స్థానిక మార్కెట్ యార్డులో పత్తి ధర పెరిగిందని వ్యాపారులు తెలిపారు. శుక్రవారం 4,340 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4480, గరిష్ఠ ధర రూ.7229, మధ్యస్థ ధర రూ. 7089 పలికాయి.

శ్రీశైలంలో ఉచిత బస్సు సేవలు

లాంఛనంగా ప్రారంభించిన అధికారులు



ఉచిత బస్సును ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం శుక్రవారం ఉచిత బస్సును ప్రారంభించింది. పర్వదినాలు, వారాంతపు సెలవురోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శిస్తారు. భక్తులు శ్రీశైల క్షేత్రంలో ప్రయాణించేందుకు వీలుగా ప్రతి శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు బస్సును అందుబాటులో ఉంచారు. ఈ బస్సు గణేశ సదనం, అన్నప్రసాద భవనం మీదుగా క్యూ కాంప్లెక్సు వరకు ప్రయాణిస్తుంది. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.నరసింహారెడ్డి, ఏపీఆర్వో శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డలు అన్నం పెట్టడం లేదమ్మా..



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కొండన్న, నాగమ్మ

రుద్రవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కుమారులు అన్నం పెట్టడం లేదని కలెక్టర్‌తో వృద్ధ దంపతులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం కలెక్టర్ రాజకుమారి రుద్రవరం వెళ్లగా రుద్రవరం మండల ఎల్లావత్తుల గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కొండన్న, నాగమ్మ ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తమకు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు కుమారులు, వెంకటమ్మ, కుమారి, సావిత్రి అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి వారి కుమారులకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దారు మల్లికార్జునరావును ఆదేశించారు.

గోదాముల పనులు సాగేనా?

- రైతు బంధు పథకానికి తూట్లు
- ప్రైవేటు గోదాములను ఆశ్రయిస్తున్న రైతులు

బనగానపల్లె, నవంబరు 22:


బనగానపల్లెలో ప్రభుత్వ గోదాముల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత సంవత్సరం ప్రారంభమైన పనులు ఎప్పటికి పూర్తయ్యేనని రైతులు ఎదురు చూస్తున్నారు. రైతులు తమ సరుకులను ప్రైవేటు గోదాముల్లో దాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బనగానపల్లె పట్టణంలోని మార్కెట్ యార్డును 1997లో 24 ఎకరాల స్థలంలో నిర్మించారు. అప్పట్లో కేవలం ఒకే ఒక్క గోదామును నిర్మించారు. ఇందులో 365 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే నిల్వ చేసుకోవడానికి వీలుంది. 2018లో ప్రస్తుత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అప్పట్లో రూ.1.10 కోట్లతో రెండు గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఒక్కో గోదాము 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం పట్టేలా పనులు ప్రారంభించారు. 2019 నాటికి పూర్తి కావాల్సిన పనులు పెండింగ్ పడిపోయాయి.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు: బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో గోదాముల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిర్మాణంలో ఉన్న గోదాముల్లో ముళ్ల కంపలు మొలిచాయి. దీంతో రైతులు ప్రైవేటు గోదాముల యజమానులకు బస్తాకు నెలకు రూ.7చొప్పున ఇచ్చి ధాన్యం నిలువ చేసుకుంటున్నారు. ప్రభుత్వం త్వరగా గోదాముల పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతు బంధు పథకానికి తూట్లు

ప్రభుత్వ గోదాముల్లో రైతులు ధాన్యాన్ని నిల్వ ఉంచితే రైతుబంధు పథకం ప్రకారం బ్యాంకుల్లో ధాన్యం ధరను బట్టి తక్కువ వడ్డీతో మార్కెట్‌యార్డులు రుణాలు ఇచ్చేవి. అయితే గత రెండేళ్లుగా ప్రభుత్వ గోదాముల్లో నిల్వ ఉంచిన పంటలకు రైతుబంధు పథకం వర్తించడం లేదు. ఈ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రభుత్వ గోదాము



అసంపూర్తిగా నిలిచిన బనగానపల్లె మార్కెట్‌యార్డు



గోదాముల పనులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పూర్తి చేయించాలని రైతులు కోరుకుంటున్నారు. ఆయనపైనే ఆశ పెట్టుకున్నారు.

రాష్ట్ర అంచనాల కమిటీలో భూమా అఖిలప్రియకు చోటు



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ)లో భాగమైన రాష్ట్ర అంచనాల కమిటీలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు చోటు దక్కింది. శుక్రవారం అసెంబ్లీలో పీఏసీ కమిటీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అంచనాల కమిటీ సభ్యురాలిగా భూమా అఖిలప్రియ, పీఏసీ కమిటీ సభ్యుడిగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఎన్నికయ్యారు. శాసనసభ చరిత్రలో పీఏసీ కమిటీకి తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, బడ్జెట్ కేటాయింపుల మేరకు వివిధ శాఖలు చేసే నిధుల వ్యయాలపై పీఏసీ కమిటీ సమీక్షిస్తుంది. కమిటీలో శాసనసభ (ఎమ్మెల్యేలు) నుంచి 9 మంది, శాసన మండలి (ఎమ్మెల్సీలు) నుంచి ముగ్గురు చొప్పున 12 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఒకరిని పీఏసీ ఛైర్మన్‌గా ఎంపిక చేస్తారు. సాధారణంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన వారికే పీఏసీ ఛైర్మన్ పదవి ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. అయితే వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాకుండా 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే గెలిచారు. పీఏసీ కమిటీ సభ్యుడిగా ఎంపిక కావాలంటే కనీసం 20 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండాలి. దీంతో వైసీపీకి కనీసం పీఏసీ పదవి కూడా దక్కకుండా పోయింది. రాష్ట్ర విభజన తరువాత 2014-19 వరకు ఆ నాటి ప్రతిపక్ష పార్టీ వైసీపీ నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పీఏసీ ఛైర్మన్‌గా ఉన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆయనే ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2019-24 మధ్య నాటి ప్రతిపక్ష పార్టీ టీడీపీ నంచి అనంతపురం జిల్లా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పీఏసీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో తాజాగా పీఏసీ సభ్యులుగా టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా నామినేషన్ వేయడంతో ఎన్నిక అనివార్యమైంది. అనంతరం ఓటింగ్ నిర్వహించి సభ్యులను ఎన్నుకున్నారు. అంచనాల కమిటీ సభ్యురాలిగా ఎంపికైన భూమా అఖిలప్రియ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎంతో నమ్మకంతో తనకు ఈ బాధ్యత ఇచ్చారన్నారు. వివిధ శాఖల్లో నిధులు వ్యయాలపై తనిఖీలు చేస్తూ ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు.

29న మహానందిలో లక్ష బిల్వార్చన



మహానందిలో మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఈనెల 29న మహానంది ఆలయంలోని గర్భాలయంలో లక్షబిల్వార్చన నిర్వహిస్తున్నట్లు ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆలయ వేదపండితులు, అర్చకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 29న మహానందీశ్వరుడికి లక్షబిల్వార్చన, 30న కామేశ్వరీదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి స్వామి, అమ్మవార్లకు శాంతి కల్యాణం నిర్వహించడంతో మహానందిలో కార్తీక మాసోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. ఈనెల 25న కార్తీక చివరి సోమవారం పురస్కరించుకుని క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు అర్జునశర్మ, అర్చకులు జనార్ధన్‌శర్మ, శంకరయ్యశర్మ పాల్గొన్నారు.

నదుల అనుసంధానానికి స్వాగతం

- కృష్ణా జలాల వినియోగానికి సీమలో ప్రాజెక్టులు నిర్మించాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్లించి నదుల అనుసంధానం ద్వారా రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరందించాలనే ముఖ్యమంత్రి సంకల్పాన్ని స్వాగతిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నంద్యాల సమితి కార్యాలయంలో బొజ్జా మాట్లాడుతూ... 518 టియంసిలకు పైగా కృష్ణా జలాలు సముద్రంలో చేరుతున్నాయని అన్నారు. రాయలసీమలో సాగు నీటి నిర్మాణాలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని, దాన్ని పరిష్కరించాలని బొజ్జా ఒక లేఖలో ముఖ్యమంత్రిని కోరారు. నదుల అనుసంధానం మీద ప్రభుత్వం రాయలసీమలోని ప్రజా సంఘాల అభిప్రాయం తీసుకోవాలని కోరారు. కృష్ణా నదిలో నీటి లభ్యత వున్నప్పటికీ రాష్ట్ర విభజన చట్టంలో అనుమతించిన తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టుల మౌలిక నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వలన, శ్రీశైలం రిజర్వాయర్ విధి విధానాలను సక్రమంగా అమలుపరచకపోవడం వలన ఆయకట్టుకు నీరందడం లేదని అన్నార. ఈ పరిస్థితిపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. అలాగే నాగార్జున సాగర్ దిగువ నుండి ప్రకాశం బ్యారేజి వరకు కృష్ణా డెల్టాకు చట్టబద్ధంగా లభించే 101 టిఎంసిల నీటిని వినియోగించుకోకపోవడం వలన ఈ జలాలు సముద్రం పాలవుతున్నాయన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి నీటిని తరలించడం వలన శ్రీశైలం రిజర్వాయర్‌పై ఒత్తిడి పెరగడంతో పాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల ఆయకట్టుకు సాగునీరు లభించడం లేదని అన్నారు. దుమ్ముగూడెం-నాగార్జునసాగర్ టైల్‌పాండ్ ద్వారా గోదావరి జలాలను నాగార్జున సాగర్‌లో నిల్వ ఉంచి సాగర్ ఆయకట్టుకు నీరు అందించాలని అన్నారు. తద్వారా శ్రీశైలం రిజర్వాయర్ నీటిని పూర్తిగా వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు వినియోగించుకునేలా ప్రణాళిక చేపట్టాలని కోరారు.

సీమ ఆకాంక్షను నెరవేర్చిన సీఎం

ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్



నంద్యాల కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలనే సీమ ప్రజల ఆకాంక్షలను సీఎం చంద్రబాబు నాయకుడు నెరవేర్చారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు గురించి మంత్రి వర్గంలో తీర్మానం చేయడం, మండలిలో బిల్లు ప్రవేశపెట్టడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. రాయలసీమ ప్రాంతానికి ఇక నుంచి అన్నీ మంచి రోజులే వస్తాయని ఆయన అన్నారు.

హంద్రీనీవా ఎస్ఈగా సురేష్‌బాబు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కర్నూలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు (హెచ్ఎన్ఎస్ఎస్) కర్నూలు సర్కిల్-1 ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా ఎస్ఆర్‌బీసీ డివిజన్-3 అవుకు సర్కిల్-2 ఈఈ ఎ. వెంకట సురేష్‌బాబును నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎస్ఈగా పని చేస్తున్న రాంగోపాల్ బదిలీపై వెళ్లాక ఆయన స్థానంలో సురేష్‌బాబు బాధ్యతలు తీసుకుంటారు. సురేష్‌బాబు 1987లో జలవనరుల శాఖలో ఏఈఈగా విధుల్లో చేరారు. 2006లో డీఈఈగా, 2016లో ఈఈగా పదోన్నతి పొందారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్ఆర్‌బీసీ, మైనర్ ఇగిరేషన్‌లో పని చేశారు. అనంతపురం జిల్లా తుంగభద్ర ఎగువ కాలువలో కూడా పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఎస్ఆర్‌బీసీ అవుకు సర్కిల్ పని చేస్తున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కర్నూలు సర్కిల్-1 ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన వచ్చే ఏడాది ఏప్రిల్‌లో పదవి విరమణ చేయనున్నారు.

రూ.61.06 కోట్ల సెస్సు వసూలు

కడప రీజనల్ జేడీఎం రామాంజనేయులు



పత్తికొనుగోలును పరిశీలిస్తున్న జేడీఎం

ఎమ్మిగనూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప రీజియన్ పరిధిలోని 8 జిల్లాల్లో అక్టోబరు నెలాఖరు వరకు రూ.61.06 కోట్ల మేర మార్కెట్ సెస్సు వసూలు చేసినట్లు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ రామాంజనేయులు వెల్లడించారు. అదేవిధంగా కర్నూలు జిల్లాలోని పది సీసీఐ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 17,600 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు తెలిపారు. శుక్రవారం జేడీఎం ఎమ్మిగనూరు పట్టణ శివారులో పత్తి మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కమిటీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రీజియన్ పరిధిలో సెస్సు వసూలు లక్ష్యం రూ.133.16 కోట్లుగా పెట్టుకున్నామన్నారు. కర్నూలు జిల్లాలో సెస్సు వసూలు బాగుందన్నారు. ఇప్పటివరకు 47శాతం వసూలైందని తెలిపారు. జిల్లాలో ఎమ్మిగనూరులో మూడు, మంత్రాలయంలో రెండు, పెంచికలపాడు దగ్గర ఒకటి, ఆదోనిలో నాలుగు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో ఎక్కడైనా రైతులు పత్తి మద్దతు ధరకు విక్రయించవచ్చన్నారు. రైతులు ముందుగా రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకొని కేంద్రాలకు పత్తి తీసుకెళ్లాలని అన్నారు. పత్తి రైతులకు అండగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అందుబాటులోకి తెచ్చాయన్నారు. రైతులు పండించిన పండించిన పత్తి పంటలో 60శాతం కొంటున్నామని అన్నారు. డిసెంబరు 15 నుంచి పూర్తి స్థాయిలో కొంటామని తెలిపారు. పత్తి సరిగా లేదని సీసీఐ కేంద్రాల నుంచి వెనక్కి పంపుతున్నారని, తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని రైతులు ఆరోపిస్తున్నట్లు జేడీఏ దృష్టికి తీసుకెళ్లగా.. పత్తి పూర్తిగా రంగుమారినా, తేమశాతం ఎక్కువగా ఉన్నా అధికారులు ఏమీ చేయలేరని అన్నారు. ఆయన వెంట ఎమ్మిగనూరు మార్కెట్ కార్యదర్శి పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

దారి లేక.. దాటలేక..!





కోడుమూరు మండలంలోని గోరంట్ల వద్ద హంద్రీనదిలో ప్రజలు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్ని కావు. ఇక్కడ హంద్రీ నది దాటాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. వర్షాకాలంలో వరద వస్తే ఆ ఛాయలకు కూడా వెళ్లే పరిస్థితి లేదు. ఈ మార్గంలో గోరంట్ల, ఎర్రగుడి, కొత్తపల్లి, మన్నెగుంట, ఎర్రబాడు, మల్లాపురం, రామక్రిష్టాపురం, క్రిష్ణగిరి, ఎరుకలచెరువు, క్రిష్ణగిరి, బాపలదొడ్డి వంటి పలు గ్రామాల నుంచి పనులపై రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ఆటోలు, బైక్‌లు హంద్రీ నది దాటుతున్నాయి. అయితే ప్రయాణమంతా ఒక ఎత్తు కాగా హంద్రీ దాటడం సవాల్‌గా మారింది. –కోడుమూరు రూరల్

ముగిసిన జిల్లా స్థాయి ఆట్యా పాట్యా పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు ముగిసినట్లు జిల్లా సంఘం కార్యదర్శి బాలపవన్ తెలిపారు. బాలికల విభాగంలో ఓర్వకల్లు కేజీబీవీ పాఠశాల మొదటి స్థానంలో, రెండో స్థానంలో మంత్రాలయం కేజీబీవీ జట్లు నిలిచాయి. మూడో స్థానంలో పంచలింగాల కేజీబీవీ జట్టు నిలిచింది. బాలుర విభాగంలో ఓర్వకల్లు ఏపీ మోడల్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో అహోబిలం జడ్పీ హెచ్ఎస్, మూడో స్థానంలో ఆళ్లగడ్డ జడ్పీహెచ్ నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవంలో సాయికృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కొమ్ము సుందర్‌రాజు హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, ట్రోఫీని అందజేశారు.

తెలుగు విద్యార్థులకు వరం క్లస్టర్ వర్సిటీ

● నేడు యువతరంగ కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ రాక ● వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు విద్యార్థులకు క్లస్టర్ యూనివర్సిటీ వరంలాంటిదని ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలోని ఆయన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ యువతరంగ్ 2024 ఇంటర్ కాలేజీ క్రీడా పోటీలు నిర్వహించామని, గెలిచిన వారికి శనివారం వర్సిటీ క్రీడా మైదానంలో ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ హీరో సుమన్, ఎస్పీ బిందు మాధవ్, నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, టీటీడీ బోర్డు మెంబరు మల్లెల రాజశేఖర్, మాజీ ఏబీవీపీ జాతీయ కార్యదర్శి పనతల సురేష్ హాజరవుతారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి

లక్ష్యం దిశగా కృషి చేయండి

ఉన్నతమైన లక్ష్య సాధన కోసం విద్యార్థులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఆర్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం రాయసీమ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో పీజీ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రాంతాలు, వివిధ నేపథ్యాల నుంచి వర్సిటీలో పీజీ కోర్సులు చదవడానికి వచ్చిన విద్యార్థులు తమ తల్లితండ్రుల ఆశలు ఫలించేలా లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని సూచించారు. క్యాంపస్‌లో ర్యాగింగ్ ఏ రూపంలోనూ ఉండకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, డీన్స్ ప్రిన్సిపాల్స్, వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూలు లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది శుక్రవారం స్థానిక జిల్లా కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలు, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు అధికారులందరూ కృషి చేయాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థక కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి పాల్గొన్నారు.

న్యాయ శాఖ కార్యదర్శిగా ప్రతిభాదేవి

కర్నూలు లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని న్యాయ శాఖ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై కర్నూలు ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి జి.ప్రతిభాదేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిం ది. ఇప్పటి వరకు ఈ పదవిని నిర్వహిస్తున్న వి.సునీత స్థానంలో ఈమెను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తన ఉత్తర్వులో పేర్కొంది. ఈమె ఈ పదవిలో రెండు సంవత్సరాలు కొనసాగు తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా శని, ఆదివారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా తొలగింపు కోసం సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలకు అర్జీ ఇవ్వవచ్చునన్నారు.

నంద్యాల కల్చరల్: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 23 24 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహిస్తామని కలెక్టర్, ఎన్నికల అధికారి రాజకుమారి తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ముసాయిదా ఓటరు జాబితా-2025 తో అందుబాటులో ఉంచారని చెప్పారు. 01.01.2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్త ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో చిరునామాలో మార్పు చేర్పుల కోసం సంబంధిత పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓకు అర్జీ ఇవ్వాలన్నారు.

కొలిమిగుండ్లతో విడదీయరాని బంధం

● భగవాన్ సత్యసాయిబాబా మాతృమూర్తి స్వగ్రామం ● నేడు సత్యసాయిబాబా 99వ జయంతి



సాయిబాబాతో తల్లి ఈశ్వరమ్మ (ఫైల్)

కొలిమిగుండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశ విదేశాల్లో ఆధ్యాత్మిక చక్రవర్తిగా పేరుగాంచిన భగవాన్ సత్యసాయిబాబాకు కొలిమిగుండ్ల మండలంతో విడదీయరానిబంధం ఉంది. బాబా మాతృమూర్తి ఈశ్వరాంబ పుట్టినిల్లు కొలిమిగుండ్ల. నేడు సత్యసాయి 99వ జయంతి సందర్భంగా మండల ప్రజలు బాబా ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కొలిమిగుండ్లకు చెందిన సుబ్బరాజు, సుబ్బాయమ్మ దంపతుల కుమార్తె ఈశ్వరమ్మ. ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన అసలు పేరు నామగిరాయమ్మ. అయితే వివాహ అనంతరం మామ కొండమరాజు (సాయిబాబా తాత) ఆమెకు ఈశ్వరమ్మగా నామకరణం చేశారు. ఈశ్వరమ్మ కుటుంబం ఆమె వివాహానికి ముందే తమ సమీప బంధువులు కొండమరాజు పిలుపు మేరకు పుట్టపర్తికి తరలివెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం కొండమరాజు పెద్ద కుమారుడు పెద్ద వెంకప్పరాజుతో ఈశ్వరమ్మ వివాహం జరిగింది. ఈ దంపతులకు 1926 నవంబరు 23న కలిగిన సంతానమే భగవాన్ సత్యసాయిబాబా. తల్లిదండ్రులు పెట్టిన పేరు సత్యనారాయణరాజు. అయితే తన 14వ ఏటనే సత్యనారాయణరాజు అనంతపురం జిల్లాలో సత్యసాయిబాబాగా మారారు. . సత్యసాయిబాబా చిన్నతనంలో ఈశ్వరమ్మతో కలిసి కొలిమిగుండ్ల శివాలయాన్ని పలుమార్లు సందర్శించారు. రాష్ట్రం, దేశం ఇలా ప్రపంచ నలుమూలలా తన ఆధ్యాత్మిక ప్రసంగాలతో భక్తులను ఆకర్షించారు. సుమారు 120 దేశాల్లో సత్యసాయి భక్తులు ఉన్నారంటే ఆయన ఆధ్యాత్మిక శక్తి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు మానవ సేవే మాధవ సేవ అని తలంచిన సత్యసాయిబాబా తన ట్రస్టు ద్వారా దేశ విదేశాల్లో తన సేవలను అందించారు. ఇదిలావుండగా సత్యసాయిబాబా చివరి సమయంలో కొలిమిగుండ్లలో తన తల్లి ఈశ్వరమ్మకు గుడి నిర్మించాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు కొలిమిగుండ్లకు చేరుకొని పెద్దలతో చర్చించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో 2007-2009 మధ్య కాలంలో పలుమార్లు గ్రామంలో నగర సంకీర్తన, మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటికైనా సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ జన్మించిన కొలిమిగుండ్లను గుర్తించి, బాబా సంకల్పాన్ని పూర్తి చేయాలని మండల వ్యాప్తంగా ప్రజలు కోరుతున్నారు.



సత్యసాయిబాబా తల్లి ఈశ్వరమ్మ(ఫైల్)

వ్యాపారుల అంచనా తలకిందులు

క్వింటా రూ.5 వేలు దాటిన ఉల్లి



మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉల్లి ధర నవంబరు 2వ వారం నుంచి తగ్గిపోతుందని వ్యాపారులు అంచనా వేశారు. మహారాష్ట్ర నుంచి ఏపీ మార్కెట్‌కు భారీగా విక్రయానికి ఉల్లి తరలివస్తుందని, దీంతో కర్నూలులో ఉల్లికి డిమాండ్ తగ్గుతుందని వారు అంచనా వేశారు. అయితే.. వారి అంచనాలను తలకిందుల చేస్తూ కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి ధర పెరిగిపోతోంది. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం ఉల్లి ధర గరిష్ఠంగా రూ.5,099కు చేరింది. మధ్యస్థ ధర రూ.3,388, కనిష్ఠ ధర రూ.495 పలికిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలి పారు. అదేవిధంగా ఎండుమిరపకాయలు గరిష్ఠ ధర రూ.15,613, మధ్యస్థ ధర రూ.10,109, కనిష్ఠ ధర రూ.713కు చేరింది.

26న 'కార్మిక' ఆందోళన : సీఐటీయూ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వినాశకర విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక, రైతులు సంఘటితమై 26న చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ హమాలీ కార్మికులు, మార్కెట్ యార్డు లారీ హమీల కార్మికుల సర్వసభ్య సమావేశం నగర కార్యదర్శి సీహెచ్.సాయిబాబ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయం,కార్పొరేటీకరణ, జీవనోపాధులపై బీజేపీ ప్రభుత్వాలు సాగిస్తున్న దాడులు తిప్పికొట్టాలన్నారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జడ్పీ సమావేశం వాయిదా

కర్నూలు న్యూసిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జరగాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు జడ్పీ సీఈవో జి నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానుండటంతో సమావేశం వాయిదా వేశామన్నారు.

ఆక్సిజన్ పైపులైన్ పనులు వేగవంతం చేయండి



డైట్‌లో డాక్టర్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆక్సిజన్ పైపులైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పనులు వెంటనే ప్రారంభించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పలు విభాగాల్లో రౌండ్స్ నిర్వహించారు. డైట్ విభాగంలో డాక్టర్స్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. వైద్యులందరినీ తనిఖీ చేసి వారి సంతకాలు తీసుకోవాలని డైటీషియన్ రామాంజనేయులును ఆదేశించారు. వేసవి కాలంలో ఔషధాల నిలుపుదల కోసం రూఫింగ్‌తో ఫార్మసీ డిస్పెన్సరీలో మరమ్మతులను చేయనున్నట్లు తెలిపారు. ఈ రౌండ్స్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్లు డా.డి. శ్రీరాములు, డా. సీతారామయ్య, సీఎస్ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని పాల్గొన్నారు.

హైకోర్టులో బెంచ్ ప్రకటనపై ఆర్‌యూలో సంబరాలు

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై రాయలసీమవర్సిటీలో శుక్రవారం ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ఉద్యోగులు సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గౌరవ అధ్యక్షుడు సురేంద్రనాథ్‌రెడ్డి, మీనాక్షిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, సలహాదారుడు రంగనాథ్ గౌడు మాట్లాడుతూ కర్నూల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ఇక్కడి ప్రజల ఆకాంక్ష అన్నారు. దశాబ్దకాలంగా రాయలసీమ ప్రజలు ఎదురు చూస్తుండగా, ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటం శుభపరిణామని కొనియాడారు.



ఆర్‌యూలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

అమ్ముకోవాలన్నా అగచాట్లే..!

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల కష్టాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటను అమ్ముకునేందుకు వస్తే రైతులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గూడురు మండలంలోని పెంచికలపాడు వద్ద సీసీఐ కొనుగోలు కేంద్రానికి శుక్రవారం పత్తి దిగుబడులు పోటెత్తాయి. కొనుగోలు కేంద్రం పరిసరాలతో పాటు కర్నూలు రహదారిపై భారీగా వాహనాలు నిలిచి ఉన్నాయి. టోకన్ నంబర్ ప్రకారం వాహనాలను అనుమతిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో పత్తి ధర ఆశాజనకంగా లేకపోవడంతో సీసీఐకు విక్రయించుకోవడానికి రైతులు క్యూ కట్టారు. చాలామంది రైతులు రెండురోజుల నుంచి సీసీఐ కేంద్రం వద్ద పడిగాపులు పడుతున్నారు. అన్‌లోడింగ్ ప్రక్రియ నిదానంగా సాగుతుండడమే కారణమని వాపోతున్నారు. దీంతో వాహనం బాడుగతో పాటు అదనంగా ఉన్న రోజుకు దూరంబట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు చెల్లించుకుంటున్నామని రైతులు తెలిపారు. రాత్రిపూట చలికి తోడు దోమల బెడద తప్పడం లేదని అన్నారు. పత్తి తనిఖీ, అన్‌లోడింగ్ పూర్తయ్యేవరకు నిద్రాహారాలు లేవని ఆవేదన చెందారు. అన్‌లోడింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీసీఐ కేంద్రం వద్ద వాహనాలు



గూడురు మండలం పెంచికలపాడు వద్ద సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తి వాహనాలు



బైక్ షోరూం ఉద్యోగి చేతివాటం


నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు

- నాలుగేళ్లుగా స్పేర్ పార్ట్స్ చోరీ
- రూ.2.36 కోట్ల విలువైన పరికరాలు పక్కదారి
- అరెస్టు చేసిన పోలీసులు

కర్నూలు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు ఘటనల్లో ఆ సంస్థల్లో పని చేసే ఉద్యోగులే చేతి వాటం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళితే.. బజాజ్ షోరూంలో పని చేసే హరికృష్ణ, మునిస్వామిలు వివిధ వాహనాల స్పేర్ పార్ట్స్‌ను విక్రయించి ఆ నగదును వారి ఖాతాల్లో వేసుకున్నారు. ఈ ఘటనను ఆలస్యంగా గుర్తించారు. సీఐ నాగరాజురావు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు ఎస్టేట్ ముజఫర్ నగర్‌కు చెందిన హరికృష్ణ యువకుడు బీటెక్ పూర్తి చేశాడు. 2016 నుంచి బంగారుపేటలోని బజాజ్ స్పేర్ పార్ట్స్ సేల్స్ అండ్ షోరూంలో ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. ఇదే సంస్థలో మునిస్వామి అనే మరో యువకుడు 2020లో ఉద్యోగంలో చేరాడు. స్పేర్ పార్ట్స్ విక్రయించడంలో సంస్థ పెద్దగా పట్టించుకోకపోవడం, సేల్స్, దాని నగదు గురించి పెద్దగా పట్టించుకోలేదు. దీంతో హరికృష్ణ ఇదే అదునుగా భావించి నాలుగేళ్లుగా స్పేర్ పార్ట్స్‌తో విక్రయించిన సొత్తును తన ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. కొన్ని స్పేర్ పార్ట్స్‌ను సగం ధరలకే విక్రయించేవాడు. ఇలా నాలుగేళ్లుగా నిరాటంకంగా తన బిజినెస్‌ను కొనసాగించి రూ.2.36 కోట్ల సేల్స్‌ను తన ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. ఇది గుర్తించి మరో ఉద్యోగి మునిస్వామి హరికృష్ణను నిలదీయగా తనను వలలో వేసుకున్నాడు. మునిస్వామికి కూడా నెలా నెలా రూ.10వేల చొప్పున సమర్పించుకుంటూ వచ్చాడు. తీరా ఆ సంస్థ హెడ్ ఆఫీసర్, సిబ్బంది ఆడిట్ చేయగా.. లెక్కల్లో తేడా రావడంతో అనుమానం వచ్చింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి నిందితులిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హరికృష్ణ వద్ద నుంచి రూ.36.70 లక్షలు, మునిస్వామి నుంచి రూ.6.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

చందన బ్రదర్స్‌లో..

చందనబ్రదర్స్‌లో ఈ నెల 11వ తేదీన జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఆలూరు మండలం హోలేబీడు గ్రామానికి చెందిన సురేష్ చందనబ్రదర్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. తనకు కొంత డబ్బు అవసరం ఉండటంతో ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిసింది. 11వ తేదీ అర్ధరాత్రి తర్వాత ఎవరూ లేని సమయం చూసి షోరూం పై నుంచి ఉన్న కన్నంలో నుంచి కిందకు దూకాడు. అందులో నుంచి కిందకు వచ్చి క్యాష్ కౌంటరులో ఉన్న రూ.2.35 లక్షల నగదును చోరీ చేశాడు. సీసీ కెమెరాల ద్వారా నిందితుని గుర్తించి పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్ కిషోర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ రవికుమార్, శ్రీనివాసులు, మహేంద్ర, మల్లికార్జునలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

ఆలూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హత్తిబెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరుణ్ కుమార్, మౌలా హుసేన్ రాష్ట్రస్థాయి సెపక్ తాక్రా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శివప్రసాద్, పీడీ చిన్న బాబు శుక్రవారం తెలిపారు. కర్నూలులో 21న సెపక్ తాక్రా అండర్ 14బాలుర విభాగంలో ప్రతిభ చూపారని చెప్పారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఈనెల 26,27తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొం టారన్నారు.

పార్టీ కోసం పని చేసిన వారందరికీ పదవులు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



డైరెక్టర్లు, చైర్మన్లను సన్మానిస్తున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ కోసం పని చేసిన వారందరి కోసం ప్రభుత్వ పదవులు ఇప్పించేందుకు కృషి చేస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన డైరెక్టర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో కుడా చైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఫెడరేషన్ చైర్మన్లుగా కపత్రాళ్ల బోజమ్మ, దేవేంద్రప్పలతో పాటు పలువురు డైరెక్టర్లను అభినందించారు. అధినేత చంద్రబాబు పార్టీ కోసం పని చేసిన నాయకులను, కార్యకర్తలను గుర్తు పెట్టుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, పి.అమర్నాథరెడ్డి, మీనాక్షినాయుడు, డి. సుందరరాజు, సోమిశెట్టి నవీన్, పేరపోగు రాజు, జే. తిరుపాల్ బాబు, షేక్షవలి పాల్గొన్నారు.

పాణ్యం అభివృద్ధి కోసం కృషి

- అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో గళం వినిపించారు. ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా ఏర్పాటు చేస్తానన్న హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. దేశంలో 12 మ్యాన్యూఫ్యాక్చర్ క్లస్టర్లు మంజూరు కాగా రాష్ట్రానికి మూడు వచ్చాయని, అందులో ఓర్వకల్లు ఒకటన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.2800 కోట్లు మంజూరు చేయించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. గోరుకల్లు రిజర్వాయర్, తుంగభద్ర, కేసీ కెనాల్, హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ, హంద్రీనది ఉన్నా కల్లూరు అర్బన్ 16 వార్డుల ప్రజలకు తాగునీరు ఇవ్వలేకపోతున్నామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమృత్ స్కీంలో రూ.115 కోట్లు మంజూరు చేసిందని ఆ పనుల్లో పురోగతి లేదని తక్షణమే సంబంధిత పనులు మొదలుపెట్టేలా అధికారులకు సూచించాలని మంత్రిని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఅక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో మోడల్ ఐటీఐ కాలేజీ స్థాపించాలని అభ్యర్థించారు. ఇండస్ట్రియల్ హబ్‌లో రూ.2800 కోట్లుతో మౌలిక వసతులు, డ్రోన్ హబ్ ఏర్పాటుపై సీఎం చంద్రబా బుకు కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు ఫోర్‌లైన్ రోడ్డును పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు, మంత్రి ఫరూక్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు పూర్తి చేయండి

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 439 అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 439 అంగన్‌వాడీ కేంద్రాలలో 231 టాయిలెట్లకు గాను 191 పూర్తయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న 41 టాయిలెట్ల నిర్మాణాలు, అలాగే 425 తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 33 తాగునీటి పైపులైన్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అడవి పందుల బెడద


పందులు నాశనం చేసిన పంట

వెలుగోడు నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి వరి పంటలు వేలాది ఎకరాల్లో సాగు చేశారు. సమృద్ధిగా నీరు లభించడంతో పంట పొలాలు బాగా పండాయి. పంట చేతికొచ్చే సమయంలో రైతులకు అనుకోని దెబ్బలు తగులుతున్నాయి. వెలుగోడు అటవీ సమీపంలోని బొందుల కుంట, ఈదుల చెరువు, మద్రాస్ కెనాల్ వెంట సాగు చేసిన వరి పంటలపై అడవి పందులు దాడి చేస్తున్నాయి. చేతికొచ్చిన పంటను తొక్కి చేతికందకుండా చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వంద ఎకరాల్లో అడవి పందు లు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడవి పందుల బెడద నుంచి కాపాడాలని రైతులు కోరుచున్నారు.

గుడిసె దగ్ధం.. రూ.6 లక్షల ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు

బండి ఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీసీ పాలెం గ్రామంలో గుడిసె దగ్ధమైంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన సమీరా ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో గుడిసె కు మంటలు వ్యాపిం చాయని గ్రామస్థులు తెలిపారు. ఇంట్లోని ఆరు తులాల బంగారం, రూ.50వేల నగదు, టీవీ, బియ్యం, వంట సామగ్రి కాలి బూడిదయ్యాయని తహసీల్దార్ ఆల్ఫ్రెడ్ తెలిపారు. బాధితురాలికి సుమారు రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించి ఉంటుందన్నారు.

మాట నిలుపుకున్న చంద్రబాబు

- హైకోర్టు బెంచ్ ఏర్పాటులో మంత్రి టీజీ భరత్ కృషి అభినందనీయం
- మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్


మాట్లాడుతున్న రాయలసీమ హక్కుల వేదిక వ్యవస్థాపకుడు టీజీ వెంకటేశ్

కర్నూలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేశారని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బార్ అసోసియేషన్ అధ్వర్యంలో శుక్రవారం రాయలసీమ సమస్యలపై పోరాడి, హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు దోహదం చేసిన బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ మూర్తి, రవికాంత్, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు రవిగువేరా, న్యాయవాది సయ్యద్‌ఖాద్రీలను టీజీ సన్మానించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడు తూ రాయలసీమ హక్కుల ఐక్యవేదిక స్థాపించి 20ఏళ్లు అయ్యిందని, ఇన్నేళ్లకు సీఎం చంద్రబాబు రాయలసీమ ప్రజల కోరికను తీర్చారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని చెప్పి ద్రోహం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు మొదటి నుంచి కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఒకే మాట చెప్పారని, దానికే కట్టుబడి ఆ దిశగా అడుగులు వేయడం అభినందనీయం అన్నారు.

రైతులకు గరుసు దొంగల బెడద

- పొలాలను రక్షించమంటున్న రైతులు
- రైతుపై దౌర్జన్యానికి దిగిన అక్రమార్కులు


టిప్పర్‌లో గరుసు నింపుతున్న ఎక్స్‌కవేటర్

ఆదోని రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాడు వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అనుచరు లు ఆదోని నలువైపులా ఉన్న కొండలను పిండిచేసి గరుసు తవ్వుకొని ఆస్తులు పెంచుకు న్నారు. నేడు కూటమి నాయ కులు వాళ్లను మించిపోయా రు. రాత్రింబవళ్లు ఆదోని చుట్టుపక్కల ఉన్న కొండల్లో గరుసు తవ్వుకొని అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఎమ్మెల్యే పార్థసారథికి కుడి భుజంగా ఉంటున్న గుడిసె కృష్ణమ్మ కన్నుసన్నల్లో గరుసు తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గరుసు తవ్వకాల వల్ల రైతులు లబో దిబోమంటున్నారు. ఆదోని పట్టణానికి చెందిన బోయ శ్రీనివాసులు తల్లి బోయ సుజాతమ్మ పేరిట ఎస్. కొండాపురంలో సర్వే నెం.116లో 3.46 ఎకరాల భూమి ఉంది. ఈ పొలం చుట్టూ కొండలు ఉన్నాయి. ఈ కొండల్లో గతంలో టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ అనుచరుడు కపటి గ్రామానికి చెందిన మాధవ అక్రమంగా గరుసు తవ్వుకుంటున్నాడు. గరుసును తవ్వడం వలన తమ పంటలు నాశనం అవుతా యని పలుమార్లు రైతు శ్రీనివాసులు, ఆయన తల్లి సరోజమ్మ అడ్డుకోడానికి ప్రయత్నిం చారు. గరువు తవ్వితే కొండల్లో నుంచి నీరు వచ్చి పంట పొలాలు నాశనమవుతాయని, పొలాలపై మట్టి పడుతుందని రైతు శ్రీనివాసులు తవ్వకాల ఫొటోలను తీశాడు. శుక్రవారం గరుసు తవ్వకాలను అడ్డుకోడా నికి రైతు ప్రయత్నించాడు. దానికి తవ్వకాలను ఆపేది లేదని, ఎవరికైనా చెప్పుకోమని కపటి మాధవ దౌర్జన్యానికి దిగాడని రైతు తెలిపాడు. గుడిసె కృష్ణమ్మ అనుచరుడు కపటి మాధవ చేపట్టిన గరుసు తవ్వకాలను ఆపాలని, పొలాలను రక్షించాలని రైతు శ్రీనివాసులు కోరాడు.

నీ కూతురు ఆపదలో ఉంది..
రూ.లక్ష పంపు

- పత్తికొండ వాసికి అగంతకుడి ఫోన్ కాల్
- విదేశాల్లో ఉన్నది కొడుకు కావడంతో మోసాన్ని గుర్తించిన వైనం

పత్తికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ కల్లుపెంట వీధిలో కిరాణం షాపు నడుపుకుంటున్న నజీర్‌కు +923476648113 నంబరు నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి ఇంగ్లీష్ ఆర్ హిందీ అంటూ మాటలు మొదలుపెట్టాడు. హిందీ అని చెప్పడంతో విదేశాల్లో 'మీ కూతురు చాలా ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. మీరు వెంటనే రూ.లక్ష ఈ నెంబర్‌కు ఫోన్‌పే చేయండి సమయం లేదని తొందరపెట్టాడు. దీంతో కంగారుపడ్డ నజీర్ ఏమైందంటూ ప్రశ్నించాడు. 'తన పేరు విజయ్‌కుమార్ అని, మీ కూతురు ఉన్న దేశంలో పోలీస్ ఆఫీసర్‌ను అని, ముందు అర్జంటుగా డబ్బు పంపండి.. మీకూతురు ప్రమాదంలో ఉంది వివరాలు తరువాత చెబుతాను అంటూ' హడావుడి చేశాడు. అయితే విదేశాల్లో హిందువుల పేరు ఉన్న పోలీసు అధికారి ఎలా ఉంటాడన్న ఆలోచన రావడంతో నజీర్ కంగారు వదిలి ఆలోచనలో పడ్డాడు. పైగా విదేశాల్లో ఉన్నది కొడుకు కాగా అవతలి వ్యక్తి కూతురు అని చెప్పడంతో అనుమానం వచ్చింది. అయినప్పటికీ కొడుక్కి ఏమైనా అయిందా అన్న భయంతో తన కూతురు ఎలాంటి ప్రమాదంలో ఉందో వీడియో చూపాలని అడిగాడు. ముందు డబ్బులు పంపు తర్వాత నీ కూతుర్ని చూపిస్తా అంటూ సమాధానం వచ్చింది. నాకు కూతురే లేదు అసలు నువ్వెవ్వరంటూ నజీర్ గట్టిగా మాట్లాడడంతో అవతలి వ్యక్తి ఫోన్ కట్ చేశాడు. మరోసారి నెంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో వెంటనే విదేశాల్లో ఉన్న తన కొడుక్కి నజీర్ ఫోన్ చేశాడు. తాను అక్కడ క్షేమంగా ఉన్నానని, అలాంటి ఫోన్ కాల్‌తో జాగ్రత్త అంటూ కొడుకు చెప్పడంతో టెన్షన్ నుంచి తేరుకున్నాడు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

సి.బెళగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామ సమీపంలో తుంగభద్రనదిలో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఐ తిమ్మారెడ్డి సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానులు గ్రామ పంచాయతీ అనుమతి తీసుకుని ట్రాక్టర్లకు ఉచిత ఇసుక బ్యానర్ కట్టుకోవాలన్నారు. ఎమ్మిగనూరులో 2, పులకుర్తి ఒక ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీహార్ నుంచి తుపాకులు!

- ఆదిలాబాద్ జిల్లాలో సున్నిపెంట వాసితో పాటు ముగ్గురి అరెస్టు
- పిస్టళ్లు, బుల్లెట్లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న పిస్టళ్లు, బుల్లెట్లు

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీహార్ నుంచి తుపాకులను తీసుకొస్తుండగా నలుగురిని తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. శ్రీశైలం సమీపంలోని సున్నిపెంటకు చెందిన వెంకట్‌రెడ్డి గతంలో జనశక్తిలో పని చేశాడు. సూర్యాపేటలో తన స్నేహితుడిని చంపేసిన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు, అలాగే కర్నూలు జిల్లాలో జనశక్తి పార్టీని పునర్నిర్మించేందుకు తుపాకులను కొనుగోలు చేయాలనుకున్నాడు. ఇందుకుగాను నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన వ్యాపారి ప్రసన్నరాజును ఆర్థిక సాయం చేయాలని కోరగా అతడు అంగీకరించాడు. వెంకట్‌రెడ్డి, హేమకాంత్‌రెడ్డి కలిసి సున్నిపెంటకు చెందిన దిలీప్, అతని రెస్టారెంట్‌లో పనిచేసే బిహార్‌కు చెందిన భైరవ్‌తో కలిసి ఇటీవల కాశీకి వెళ్లారు. ఆ తర్వాత భైరవ్ బిహార్‌లోని మ్యుంగార్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి పిస్టల్స్, బుల్లెట్లను కొనుగోలు చేశాడు. వాటిని తీసుకొని దిలీప్, హేమకాంత్‌రెడ్డి తిరిగి వస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు గురువారం రాత్రి ఆదిలాబాద్ బైపాస్ రోడ్డు వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు 7.65 ఎంఎం పిస్టళ్లు, 8 మ్యాగజైన్‌లు, 18 లైవ్ రౌండ్‌లతో పాటు ప్రయాణించిన కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 9 మందిపై కేసు నమోదు చేశారు. కేసులో ప్రధాన నిందితుడు వెంకట్‌రెడ్డి, ప్రసన్న రాజులను శుక్రవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. వెంకట్‌రెడ్డిపై ఇప్పటికే మూడు హత్య కేసులు, హత్యాయత్నం కేసు, నాలుగు జనశక్తికి సంబంధించిన కేసులు, రెండు టాడా కేసులు.. ఇలా మొత్తం 10 కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన ఐదుగురు నిందితుల కోసం ఏపీ, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేక పోలీసు బృందాలను పంపించినట్లు చెప్పారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలి

● డీఈవో జనార్దన్‌రెడ్డి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

గడివేముల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపరచాలని డీఈవో జనార్దన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గడిగరేవుల, గడివేముల హైస్కూళ్లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజ పథకాలను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాలను పరిశీలించారు. పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడానికి కావాల్సిన సూచనలు ఇచ్చారు. గడిగరేవుల హైస్కూల్‌లోకి కేసీ కెనాల్ నీరు చేరి పాఠశాల ప్రాంగణం మునిగిపోయిన తీరును హెచ్‌హెంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. జిల్లా ఉర్దూ డీఐ అస్మద్దీన్, ఎంఈవో విమలావసుంధరాదేవి, హెచ్‌ఎంలు రాజేంద్రప్రసాద్, విక్టర్ ఇమ్మానుయేలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోండి'

గడివేముల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వాసుదేవ గుప్తా సూచించారు. మండలంలోని గని గ్రామంలో గోకులం షెడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం తోడ్పాటు అందించేందుకు గోకులం షెడ్ల నిర్మాణానికి రాయితీలు అందిస్తోందన్నారు. అనంతరం గని సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. జాబ్‌కార్డులను పరిశీలించారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో వెంకటరమణ, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

'దాత దురుసు ప్రవర్తనతో విసిగిపోయాం'

మహానంది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయానికి నిత్యాన్నదాన సత్రానికి కొన్ని సంవత్సరాలుగా కూరగాయలు ఉచితంగా సరఫరా చేసే దాత పలుసార్లు దురుసుగా ప్రవర్తించడం వల్ల తాము విసిగి పోయినట్లు ఆలయ వేదపండితుడు రవిశంకర్ అవధాని తెలిపారు. శుక్రవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఇటీవల క్షేత్రంలో జరిగిన కోటి దీపోత్సవం పూజల్లో పాల్గొనేందుకు వచ్చిన కురగాయాల దాత తమ తోటి వేద పండితులతో పాటు అర్చకులపై దురుసుగా ప్రవర్తించడని తెలిపారు. పైగా తనని ఆగౌరవపరిచారని, నిత్యాన్నదాన సత్రానికి కూరగాయల సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన చెప్పారన్నారు. దీనిపై ఆరోజే పాత్రికేయులకు ఆలయంలో జరిగిన ఘటనపై వాస్తవాలు వివరించేందుకు సమావేశం నిర్వహించాలని అనుకున్నట్లు చెప్పారు. కానీ దాతపై గౌరవంతో బయటికి చెప్పలేక పోయామని తెలిపారు. అయితే తమపై, ఆలయ ఈవోపై దేవదాయశాఖ కమిషనర్‌కు దాత ఫిర్యాదు చేయడంతో మీడియా ముందు వెల్లడించాల్సి వచ్చిందని వేదపండితులు తెలపడంతో చర్చనీయాంశంగా మారింది.

'వేధింపులు ఆపాలి'



పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశాలు

బండిఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లపై ప్రభుత్వం తక్షణమే వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు ఏసు, రాజు, రత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా తక్కువ వేతనానికి అన్ని రకాల వైద్య సేవల్లో పాల్గొంటున్న ఆశాలకు ప్రభుత్వం తగు న్యాయం చేయాలన్నారు. రాజకీయ బదిలీలు తగవన్నారు. వేధింపులు ఆపకపోతే పోరాటం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం డాక్టర్ సవితకు వినతి పత్రం అందజేశారు.

'విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి'



బహుమతులు అందజేస్తున్న టీడీపీ నాయకుడు

నందికొట్కూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆల్-హాజ్-హాజీ-మహబూబ్ సాహెబ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలైన వారికి మెడల్స్, మెమోంటోలు ఆయన అందజేశారు. అలాగే సొంత ఖర్చులతో విద్యార్థులకు టీ షర్టులు అందజేశారు.

'సమయపాలన పాటించాలి'


పాములపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని బానుముక్కల, బానకచెర్ల గ్రామాలలోని సచివాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎన్‌పీసీఐ లింక్, హౌస్ హోల్డింగు, జియో ట్యాగింగ్ సర్వేలను సచివాలయ సిబ్బంది నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఆయా గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బందిని కలిసి వివరాలను తెలుసుకున్నారు. సర్వేని వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగిరిపై కార్తీక శోభ

శ్రీశైలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీగిరిపై కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శ్రీశైల మల్లన్న దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. మహిళలు దీపాలు వెలిగించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజనల కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. కాగా భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులకు శని, ఆది, సోమవారాల్లో స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే కల్పించనున్నారు. శ్రీశైలం మహాక్షేత్రంలో లోక కళ్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది.

శ్రీశైలం దేవస్థానం దర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం విజయవాడకు చెందిన పంచమ వేదనృత్యాలయం బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. తరువాతి కార్యక్రమంలో కర్నూలుకు చెందిన డి. లక్ష్మీమహేష్ భాగవతార్ బృందంతో శివపార్వతీ కళ్యాణంపై హరికథగానం చేయగా, కీబోర్డు సహకారాన్ని ఆంజనేయులు, మృదంగ సహకారాన్ని ప్రసాద్ అందించారు.

● శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కొమ్ము సూర్య సోమయాజి అనే భక్తుడు రూ. లక్ష లు విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.



ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవను ఆలయ వేదపండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. కల్యాణమంటపంలో ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆశీనులు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఎస్ శ్రీనివాసులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'కిసాన్ సభ యాప్'తో ప్రయోజనం: ఏడీఏ

నందికొట్కూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు కిసాన్ సభ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ తెలిపారు. శుక్రవారం ఏడీఏ కార్యాలయంలో ఆయనను కిసాన్ సభ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏడీఏ మాట్లాడుతూ కిసాన్ సభ యాప్‌లో సభ్యత్వం పొందడం వల్ల రైతులకు ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయన్నారు. రైతు తన పంటని, ఇతర ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకోవడానికి, రైతులు పండించిన ఉత్పత్తులకు మార్కెట్లో ఉన్న ధరల సమాచారం ఉచితంగా పొందవచ్చని తెలిపారు. మండి డీలర్లు రవాణాదారులు, ఎరువులు, పురుగుల మందుల డీలర్లు, వ్యవసాయరంగానికి సంబంధించిన వ్యవసాయ పరికరాల తయారీదారులు, ఇలా వివిధ రకాల వారి సేవల కోసం రైతులు కిసాన్ సభ యాప్‌లో సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కిసాన్ సభ జిల్లా కో ఆర్డినేటర్లు వెంకటసుబ్బయ్య, దాసరి శ్రీనివాసులు, నందికొట్కూరు, మిడ్తూరు మండలం వ్యవసాయఅధికారులు షేక్షావలి, వీరు నాయక్, నందికొట్కూరు మండల పీఆర్వో శివకుమార్, మిడ్తూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల పీఆర్వోలు మధు, శివకిషోర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

● ముగ్గురికి తీవ్ర గాయాలు.. నలుగురిపై కేసు

నందికొట్కూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణకొట్కూరు పోలీసుస్టేషన్ పరిదిలోని దామగట్ల గ్రామంలో ఇంటిముందు బర్రెల పేడ రొచ్చు విషయంలో గురువారం సాయంత్రం రెండు కుటుంబాలు గొడవ పడ్డాయి. మాటామాటా పెరిగి కర్రలతో దాడి చేసుకు న్నారు. అందులో ఒక మహిళ సుశీలమ్మకు తలపై తీవ్ర గాయం కాగా మరో ఇద్దరు దేవదానం, వినయ్ గాయపడ్డారు. పేడరొచ్చు తమ ఇంటి ముందు ఎందుకు చల్లుతున్నారని ప్రశ్నించగా దాడి చేశారని సుశీలమ్మ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దాడి చేసిన నలుగురు శేఖర్, మరియమ్మ, చరణ్, శ్యామ్‌పై కేసు నమోదు చేసినట్లు బ్రాహ్మణకొట్కూరు ఏఎస్‌ఐ రఘురామయ్యగౌడు తెలిపారు.

'ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి'

ఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదును యువత సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 23, 24 (శని, ఆదివారాలు) తేదీల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు (ఫారమ్-6), ఓటరు జాబితా నందు ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే (ఫారమ్-7), ఓటరు కార్డు నందలి సవరణల కోసం (ఫారమ్-8) ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

'హామీలు నెరవేర్చాలి'

పాణ్యం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోడి రైతులకిచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తమ్మరాజుపల్లెలో సన్నచిన్నకారు రైతులతో సామావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరల కోసం పార్లమెంట్ లో చట్టం చేయాన్నారు. ఈనెల 26 న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా నంద్యాలలో జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాలను పంపిణీ చేశారు. మండల కార్యదర్శి ప్రసాద్, సురేష్, సీఐటీయూ నాయకులు గోరుకంటి ఎర్రమల, రైతులు, హమాలి కార్మికులు పాల్గొన్నారు.

'జన్యుమార్పిడి వ్యవసాయం వద్దు'

నంద్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశంలో జన్యుమార్పిడి వ్యవసాయం వద్దని భారత్‌కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశంలో వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న జన్యుమార్పిడి పంటలను భారత్‌కిసాన్‌సంఘ్ వ్యతిరేకిస్తోందన్నారు. శుక్రవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతిపత్రం అందించారు.

లాడ్జీలపై నిఘా: డీఎస్పీ

నంద్యాల క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో భాగంగా లాడ్జీలపై నిఘా ఉంచినట్లు నంద్యాల పట్టణ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. పోలీసుల పనితీరును కూడా ఆయన తెలుసుకున్నారు. ప్రధానంగా లాడ్జీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లాడ్జీలకు వచ్చినవారి నుంచి ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. లాడ్జీల యాజమాన్యాలు తప్పనిసరిగా ప్రతి 24గంటలకు ఒకసారి ఎంతమంది కొత్త వ్యక్తులు లాడ్జీలకు వచ్చారన్న విషయం సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరురూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని నాగలూటి గూడెం గ్రామ శివార్లలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కిషోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహించామని తెలిపారు. నాగలూటి గూడెం అటవీ ప్రాంతంలో ఓ నాటుసారా స్థావరాన్ని గుర్తించి బట్టి వద్ద ఉన్న 1400 లీటర్ల బెల్లపు ఊటను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బట్టి నిర్వాహకుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. అలాగే నాగలూటి గూడెం నందు నాటు సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు వీరాస్వామి, జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది బాదుల్లా, కృష్ణుడు, సత్యనారాయణరాజు, తిక్కయ్య పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని కపిలేశ్వరంలో ఆత్మకూరు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఓ మహిళపై కేసు నమోదు చేశారు. ఆత్మకూరు ఎస్‌ఐ కిషోర్ కుమార్ తెలిపిన వివరాలివీ.. ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ మాట్లాడుతూ కపిలేశ్వరం గ్రామానికి చెందిన ఓ మహిళ గత కొంత కాలంగా సారా విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా తమ శాఖ ఎస్‌ఐలు, సిబ్బందితో దాడులు చేయగా.. సదురు మహిళ వద్ద 5 లీటర్ల నాటుసారా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. నాటుసారాను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు వీరస్వామి, జగదీష్, సిబ్బంది బాదుల్లా, రామచంద్రుడు, కృష్ణడు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. ఎవరైనా నాటుసారా, అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే 9440902585, 8328307774, 9177299067 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ ప్రజలకు సూచించారు.

'సారా విక్రయిస్తే చర్యలు'

నందికొట్కూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టుబడిన సారా నిందితులను శుక్రవారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లా మాట్లాడుతూ సారా కేసులో పట్టుబడిన నిందితులు నీలిషికారి విశ్రం, వడ్డెమాను లవన్న, నరసింహుడును తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

మదరసా పరిశీలన

పాణ్యం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాణ్యంలోని మదరసాను శుక్రవారం అలెస్కో రఘురాం రెడ్డి పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, పాఠ్యాంశాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో కార్యాలయాన్ని సందర్శించి డ్రాపౌట్స్ వివరాలు ఎంఈవో కోటయ్యను అడిగి తెలుసుకున్నారు. బడిమానిన పిల్లలను గుర్తించి వెంటనే పాఠశాలకుపంపేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై విచారణ

కొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొంత మందికి పనులు కల్పించలేదని, ఉద్యోగులకు హార్టికల్చర్ ద్వారా పనులు కల్పించాడన్న ఆరోపణలతో ముసలిమడుగు ఫీల్డ్ అసిస్టెంట్ దాసుపై శుక్రవారం ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ అన్వరాబేగం, ఏపీవో హరికృష్ణ, సర్పంచ్ జమీలాబీలతో కలిసి విచారణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ 2023-2024 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం దాని అనుబంధ శాఖల పనులపై జూలై 23న 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీడీవో కార్యాలయం ముందు నిర్వహించినట్లు తెలిపారు. అందులో ముసలిమడుగు ఫీల్డ్ అసిస్టెంట్ దాసు కొంత మందికి మాత్రమే పని పెట్టడం, ఉద్యోగం కలిగిన వారికి హార్టికల్చర్ ద్వారా పనులు కల్పించడం గ్రామ వలంటీర్లకు తనకు నచ్చిన వారికి వారం రోజులు పని కల్పించడం, మిగిలిన వలంటీర్లకు అసలు పని కల్పించకపోవడం వంటి విషయాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. దీంతో పాటు 65 మంది రైతులు హార్టికల్చర్ ద్వారా సాగు చేసిన మొక్కలు చిన్నగా ఉన్నాయని, సామాజిక తనిఖీ సిబ్బంది తనిఖీలో తెలపడంతో ఉన్నతాధికారులు విచారణ చేయాలని ఆదేశించారన్నారు. అందులో భాగంగా విచారణ చేశామని, నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామని తదుపరి చర్యలు ఉన్నతాధికారుల ఆదేశాలతో తీసుకుంటామని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 11గంటలకు ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, కోఆప్షన్‌సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు.

'పరేడ్ డ్రిల్‌తో శారీరక దృఢత్వం'

నంద్యాల క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ధృడత్వం, వికాసం పరేడ్ డ్రిల్‌తో సాధ్యమని పోలీస్ అధికారులు అన్నారు. శుక్రవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం ఎదురుగా గల మైదానంలో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందితో వీక్లీ పోలీస్ పరేడ్ డ్రిల్ నిర్వహించారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పోలీస్ డ్రిల్‌తో పాటు యోగ, ఫిజికల్ ట్రైనింగ్ తదితరాలను నిర్వహిస్తామని తెలిపారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సాయుధ బలగాల సిబ్బంది, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



పరేడ్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

సచివాలయాల తనిఖీ



వీపనగండ్లలో ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీవో

మిడుతూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వీపనగండ్ల, నాగలూటి సచివాలయాలను ఎంపీడీవో దశరథరామయ్య, ఈవోఆర్డీ సంజన్న శుక్రవారం తనిఖీ చేశారు. ఆధార్ క్యాంపును పరిశీలించారు. ఎంపీడీవో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి జియో ట్యాగింగ్, బ్యాంకు అకౌంటుకు ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలని సూచించారు. శనివారంలోపు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం సచివాలయ రికార్డులు, ఉద్యోగుల హాజరును పరిశీలించారు.

'ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి'

మిడుతూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పుట్టిన తేదీ, చిరునామా, పేరు తప్పుగా ఉంటే వాటిని సవరించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'నూతన సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడి'

నందికొట్కూరు రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు ఎప్పటికప్పుడు నూతన సస్యరక్షణ చర్యలను పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నీలిమ, డాక్టర్ చైతన్య రైతులకు సూచించారు. శుక్రవారం నందికొట్కూరు మండలంలోని కోళ్ళబావాపురం, బ్రాహ్మణ కొట్కూరు గ్రామాలలో రైతుల పొలాలలోని వివిధ పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ముఖ్యంగా శనగపంటను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ శనగపంటను ఆశిస్తున్న ఎండుతెగులు, మొదలు కుళ్లు తెగులు, లద్దెపురుగు ఎక్కువగా ఉందని తెలిపారు. పంట మార్పిడి చేయకుండా ఎక్కువ శాతం శనగ పంటను పదే పదే వేయడం వల్ల, వాతావరణ మార్పుల వల్ల ఈ వైరస్ వస్తుందని చెప్పారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నందికొట్కూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని శ్రీ లక్ష్మీబాలాజీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, శ్రీ లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో విజిలెన్స్ మరియు స్థానిక మండల వ్యవసాయ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో స్టాక్ రిజిస్టార్‌లో స్టాకులు పూర్తిగా అప్‌డేట్ చేకపోవడంతో తాత్కాలికంగా అమ్మకాలను నిలుపుదల చేశారు. రూ.8.2 లక్షలు పెస్టిసైడ్స్ స్టాక్ అమ్మకాలను నిలుపుదల చేసినట్లు వ్యవసాయశాఖ అధికారి షేక్షావలి తెలిపారు.

'నీటిముంపు భూములు సాగు చేస్తే చర్యలు'



స్థానికులు, స్థానికేతరులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్‌ఐ

కొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోనీ నీటిముంపు భూములను ఎవరైనా సాగు చేసినా, ఎవరైనా ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఉమారాణి హెచ్చరించారు. శుక్రవారం పాత సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం తదితర నీటి ముంపు ప్రాంతాల్లోని భూముల్లో ముళ్లచెట్లను కొందరు స్థానికేతరులు తొలగిస్తున్నట్లు విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఉమారాణి, ఎస్‌ఐ కేశవ, డీటీ పెద్దన్న, వీఆర్వో మౌలాలితో పాటు పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి స్థానికేతరులను అడ్డుకున్నారు. అంతకన్నా ముందే చెట్ల తొలగించడంపై స్థానికేతరులు, స్థానికుల మధ్య ముళ్ల వాగ్వాదం జరిగింది. ఇరువర్గాలతో తహసీల్దార్ మాట్లాడారు. మళ్లీ ఇదే సమస్య మొదలైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. దీంతో సమస్య సర్దుమణిగింది.

దాతల సహకారంతో క్రీడా మైదానం శుభ్రం

బండిఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని దాతల సహకారంతో శుభ్రం చేయించారు. శుక్రవారం ప్రిన్సిపాల్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణ రూ.5 వేలు, అధ్యాపకులు నజీర్ అహమ్మద్, రఘునాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయంతో పనులు చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్, షబ్బీర్ పాల్గొన్నారు.

'అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా సంఘం నాయకురాలు

ఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళా కన్వీనర్ మంజుల, ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. వివిధ సంఘాల నాయకులు రామ్‌నాయక్, రణధీర్, గోపాలకృష్ణ, పకీర్‌సాహెబ్, లక్ష్మీదేవి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

'కిశోర వికాసం'తో బాలికలకు బంగారు భవిష్యత్తు

ఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కిశోర వికాసం- వాత్సల్య మిషన్ కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు దోహదపడుతోందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో కిశోర వికాసం - వాత్సల్య మిషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు వేమ సుజాత, సాంబశివుడు, నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

'దంత వైద్యాన్ని ఎన్టీఆర్ వైద్యసేవలో చేర్చాలి'

నంద్యాల కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దంతవైద్య సేవలను ఎన్టీఆర్ వైద్యసేవలో చేర్చాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ కోరారు. ఎన్‌టీఆర్ వైద్యసేవ చైర్మన్ సీతం రాజు సుధాకర్‌ను కలిశారు. చైర్మన్ స్పందించి దంతవైద్య సేవలను కూడు ఆరోగ్యశ్రీ లో చేర్పించేందుకు కృషి చేస్తానని చెప్పినట్లు సుధీర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

నంద్యాల క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది శుక్రవారం ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు తదితర వాటిపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం తెలపాలని కోరారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అపాయం సంభవించినట్లయితే వెంటనే 100, 112టోల్ ఫ్రీ నెంబర్లకు డయల్‌చేస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. రోడ్డు భద్రతానియమాలతోపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నిల్వ నీటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

బేతంచెర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు క్యాన్సర్, మలేరియా తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. శుక్రవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వరరావుతో కలిసి నగర పంచాయతీ పరిధిలోని పట్టణం, బుగ్గానిపల్లె 1-3 ఆరోగ్య ఉపకేంద్రాలను డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆరోగ్య ఉపకేంద్రాల రికార్డులు, వైద్య సిబ్బంది నిర్వహణ రికార్డులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎన్‌సీడీ-3.0 క్యాన్సర్ పరీక్షలను చేస్తున్న తీరును చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ప్రతీ రోజు ఐదు ఇళ్లను సందర్శించి, క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. క్యాన్సర్ నిర్ధారణ అయితే.. తగు మందులు, సూచనలు, సలహాలు, వైద్య సిబ్బంది ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు డా.ప్రియాంక, డా.తస్లీమా, డా.గాయత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు పని వేళలు పాటించాలి

బేతంచెర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలు సమయపాలన పాటిస్తూ రూ.300లు కూలి పొందాలని ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ సూచించారు. శుక్రవారం మండలంలోని రెహిమాన్‌పురం, తవిసికొండ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతలు ప్రకారం పని చేసినట్లయితే.. రూ.300లు వేతనం ప్రతి కూలీ పొందవచ్చన్నారు. తాగునీరు అందుబాటులో పెట్టుకోవాలని కూలీలకు సూచించారు. ఎంపీడీవో వెంట ఏపీవో శేషన్న, ఫీల్డ్ అసిస్టెంట్ మధుశేఖర్, ఉపాధి కూలీలు ఉన్నారు.

'పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే ధ్యేయం'

బనగానపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చి ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేయడానికి ప్రతి విద్యార్థి సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని వాసవీపాలిటెక్నిక్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రించి బనగానపల్లె పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత, హరిత పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో టంగుటూరు శ్రీనయ్య, టీచర్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఉయ్యాలవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా వీఏఏలతో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో ఏఈవో రాణెమ్మ ఉన్నారు.

ఆయిల్‌పామ్ పంట సాగుపై ఆసక్తి

- ఈ ఏడాది వెయ్యి ఎకరాల సాగు లక్ష్యం
- కలెక్టర్ రాజకుమారి



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

రుద్రవరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్ పామ్ తోటలపై ఆసక్తి చూపుతున్నారని కలెక్టర్ రాజకుమారి గనియా అన్నారు. శుక్రవారం రుద్రవరం మండలంలో పెద్దకంబలూరు మెట్ట వద్ద ఏర్పాటు చేసిన 3ఎఫ్ నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది 300 హెక్టార్లలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిచ్చేందుకు నర్సరీల్లో 50 వేల మొక్కలు సిద్ధం చేశామన్నారు. ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో సాగు చేసేందుకు లక్ష్యం ఉందన్నారు. ఇప్పటికే సుమారు 200 ఎకరాలు పైబడి రైతుల ఆయిల్ పామ్ మొక్కలు నాటారన్నారు. అలాగే కొండమాయపల్లె రెవెన్యూ పరిధిలో సాగు చేసిన మామిడితోట, రుద్రవరం సచివాలయం వద్ద నిర్మాణం చేప ట్టిన రూఫ్ స్ట్రచ్చర్ పనులను పరిశీలించారు. ఉపాధిహామీ పనుల వద్ద ఏర్పాటు చేసే బోర్డులపై గాంధీ బొమ్మ స్పష్టంగా కనిపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, ఉపాధి హామీ పీడీ జనార్దన్, తహసీల్దారు మల్లికార్జున రావు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీడీ సాంబశివరావు, ఆయిల్‌పామ్ నర్సరీ నిర్వాహకుడు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారిపై కేసు నమోదు చేయండి

రుద్రవరంలో మొక్క జొన్నలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వలేదని రైతులు కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి వ్యాపారి గోపాల్‌పై కేసు నమోదు చేయించాలని తహసీల్దారు మల్లికార్జునరావును ఆదేశించారు. ఎంత మంది రైతులు ఉన్నారు, ఎంత డబ్బులు ఇవ్వాలని వివరాలు సేకరించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చేస్తామని కలెక్టర్ అన్నారు. ద్వారిమి, గుట్టకొండ దేవాలయాలకు రహదారి నిర్మాణం చేపట్టాలని కలెక్టర్‌కు సత్యం, బండల శ్రీనులు అర్జీ ఇచ్చారు. రుద్రవరంలో రెండేళ్లు గా పారిశుధ్య కార్మికులకు జీతాలు అందలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

బాసాపురం పూజలు

మండలంలోని బాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామికి, లక్ష్మీ గోదాదేవికి, లింగేశ్వరస్వామి, త్రిపుర సుందరి అమ్మవార్లకు కలెక్టర్ రాజకుమారి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మధు సూదన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి నరసింహులు, అర్చకులు పూర్ణకుంభముతో స్వాగతం పలికారు. కలెక్టర్‌ను సన్మానించారు.

పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలవాలి

- అసెంబ్లీలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగంలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో ప్రస్తావించారు. గత టీడీపీ ప్రభుత్వంలో టూరిజంశాఖ మంత్రిగా పని చేసే అవకాశం సీఎం చంద్రబాబు నాయుడు కల్పించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో రోప్‌వేకు అనుమతులు మంజూరు చేయగా, వైసీపీ ప్రభుత్వంలో వాటిని రద్దు చేశారన్నారు. అలాగే ఆస్ట్రేలియన్ కంపెనీలు రాష్ట్రంలో హోటల్స్ ఏర్పాటుకు ఎంఓయూలపై సంతాకలు సైతం చేశామన్నారు. ప్రస్తుతం వాటిని కూడా పరిశీలించాలని టూరిజంశాఖ మంత్రిని ఎమ్మెల్యే కోరారు. దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో బీచ్‌లు, రిసార్ట్‌లు, బ్యాక్‌వాటర్, హిల్ స్టేషన్స్, టెంపుల్ టూరిజం తదితర ఎన్నో పర్యాటక ప్రదేశాలున్నాయని, వాటిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో కోరారు.

జగన్ ఆస్తులు జప్తు చేయాలి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

డోన్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సమగ్ర విచారణ జరిపించి ఆయన ఆస్తులను జప్తు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అమెరికా వంటి అగ్రదేశంలోని కీలక వ్యవస్థలు జగన్‌రెడ్డి అవినీతిని బయట పెట్టడంతో ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు విలువలతో కూడిన పాలన అందిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి పాటు పడుతూ ప్రపంచంలో ఖ్యాతిని గడించారన్నారు. ఏపీపై ఉన్న ఖ్యాతి దిగజారడానికి జగనే కారణమన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు కలిగి ప్రతిపక్ష హోదాకు అర్హత లేని జగన్‌రెడ్డి పీఏసీ చైర్మన్ అడగడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు.

డీఎస్పీని కలిసిన సాయి కమిటీ సభ్యులు



డీఎస్పీని సన్మానిస్తున్న సాయి కమిటీ సభ్యులు

డోన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డోన్ డీఎస్పీ శ్రీనివాసులును సాయి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులును సన్మానించారు. ఈ సందర్భంగా షిరిడీ సాయిబాబా అలయ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సాయి కమిటీ సభ్యులు ధర్మవరం సుబ్బారెడ్డి, సీఎం శ్రీనివాసులు, పార్థసారథి, కొండా సురేష్, అలా మల్లికార్జున రెడ్డి, శ్రీరాములుగౌడ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కందుకూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన విద్యార్థులు పటాన్ అయినియా, పటాన్ అయానా, ఆకుల డింపుల్, ఆకుల చేతన్‌రాయ్, గోపీచంద్ సత్తాచాటి నాలుగు బంగారు పతకాలు, మూడు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించినట్లు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎల్‌టీ చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. 38వ జాతీయ సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు ఆళ్లగడ్డ నుంచి ఐదుగురు, నంద్యాల, కర్నూలు నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎంపికయ్యారని అన్నారు. హర్యానా రాష్ట్రంలోని పంచకుల జిల్లాలోని దేవి లాల్ స్టేడియంలో త్వరలో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను కోచ్ మౌళి, జాతీయ క్రీడాకారి భువనేశ్వరి, అరుణోదయ స్కూల్ హెచ్‌ఎం ఇమాం హుసేన్ అభినందించారు.

కురువ సంఘం సంక్షేమానికి కృషి

శిరివెళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : కురువ సంఘం సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఆ సంఘం శిరివెళ్ల మండల అధ్యక్షుడు పీపీ లింగమయ్య, కార్యదర్శి చిలకల రాంపుల్లయ్య అన్నారు. కోటపాడు, యాళ్లూరు, జిల్లెళ్ల, గోస్పాడు, కృష్ణాపురం గ్రామాల్లోని కురువ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో యాళ్లూరు వద్ద ఉన్న చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కురవ సంఘీయుల కార్తీక మాస వనభోజ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాసులు స్వామి, కురువ బాలుడు, వంక నాగయ్య, మల్లెల చంద్రశేఖర్, శ్రీను, లక్ష్మీనారాయణ, రాముడు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదికి సన్మానం

డోన్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డోన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది రామలింగయ్యను సన్మానించారు. డోన్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులు కావడంతో శుక్రవారం రామ లింగయ్యను సత్కరించారు. కార్యక్రమంలో డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడు, సీనియర్ న్యాయవాదులు కురిమెట్ల నారాయణ, లక్ష్మన్న, కాశీంసాహేబ్, శివరామకృష్ణ, టీఈ రామచంద్రగౌడ్ పాల్గొన్నారు.

హసన్‌వలి మౌలాలి స్వామికి గంధం సమర్పణ

డోన్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో వెలసిన హజరత్ హసన్‌వలి మౌలాలి స్వామి దర్గాలో శుక్రవారం గంధం వేడుకలు నిర్వహించారు. దర్గా కమిటీ కార్యదర్శి ఎస్‌ఏ చిన్నరెహిమాన్ మాట్లాడుతూ శనివారం ప్రత్యేక పూజలు, ఆదివారం కిస్తీ జియారత్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

- జడ్పీ చైర్మన్ ఎర్రబోతులకు 104 సిబ్బంది వినతి



జడ్పీచైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని 104 సిబ్బంది కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి 104 ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104సిబ్బంది ప్రతాప్, భాస్కర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న తమ సమస్యల పరిష్కా రానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, అరబిందో కంపెనీ ఈనెల 30లోగా తమ డిమాండ్లపై దృష్టి సారించకపోతే, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని 108 ఉద్యోగులు కోరారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండలానికి చెందిన 108 సిబ్బంది కరపత్రాలు పంపిణీ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ శివతో పాటు, వైద్యుడు హరిచరణ్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. రవి, భాస్కర్, చంద్రనాయక్, చిన్నయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ పోషకాహారం తీసుకోవాలి

శిరివెళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు, రోగ నిరోధక శక్తి పెరగడానికి అనుబంధ పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యురాలు దివ్య సూచించారు. గ్రామంలోని జెండాపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆరు సంవత్సరాల లోపు చిన్నారులు ఎత్తు, బరువును పరిశీలించి ఆరోగ్య, ఆహార సలహాలు అందించారు. అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించరాదు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి బెల్లం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో బెల్లం వ్యాపారస్థులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. నాటు సారా తయారీ దారులకు బెల్లం విక్రయించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ప్రతి దుకాణంలో జరిగే బెల్లం విక్రయాలు, నిల్వలు, ఎక్కువ మోతాదులో కొనుగోలు చేసే వ్యక్తుల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేసి ఎక్సైజ్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్‌ఐ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి ధార్మిక ప్రవచనాలు

ప్యాపిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నపూర్ణ సమేత ఈశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి ధార్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తిరుపతి, తిరుమల దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, సభ్యులు దేవీదయానంద్‌సింగ్, నరేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఈశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ధర్మ ప్రచార మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ కవి తొగటి సురేష్ బాబు ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ప్రజలు పాల్గొనాలని కోరారు.

'పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

చాగలమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రక్షణ కల్పించలేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఓ పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించని పాఠశాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాగలమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ.20 లక్షలు నిధులతో రోడ్డు పనులను టీడీపీ నాయకుడు రమణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, భూమా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అవుకు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అవుకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

కూలీలకు పని కల్పించాలి

రుద్రవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీలో 50 మంది కూలీలకు ఉపాధి పని కల్పించాలని పీడీ జనార్దన్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడీ సాంబశివరావు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఏపీవో ప్రతాప్, ఈసీ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

బేతంచెర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన వీరాంజనేయులు, సుబ్బమ్మ దంపతుల కుమారుడు అఖిలేష్ కుమార్ రెండు రోజుల క్రితం తప్పిపోయాడు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పిపోయిన అఖిలేష్ కుమార్ కోసం బేతంచెర్ల ఎస్‌ఐ రమేష్ బాబు, సిబ్బంది భానుప్రకాష్ ఆయా ప్రాంతాల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి శుక్రవారం మహానంది గుడి పరిసర ప్రాంతాల్లో గుర్తించారు. బేతంచెర్లకు తీసువచ్చి అఖిలేష్ కుమార్‌ను తల్లి సుబ్బమ్మకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు బీసీ రాజారెడ్డి పరామర్శ



టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె , నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద చైనాను బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పెద్ద చైనాను బీసీ రాజారెడ్డి కలిశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చైనా కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట గౌండాబాబు, షబ్బీర్, రజాక్ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు ఎళ్లవేళలా అండగా ఉంటామని ఆ పార్టీ నాయకుడు భార్గవ్‌రామ్ అన్నారు. చాగలమర్రి మండలం చిన్న బోధనం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చాకలి రాముడు రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న భార్గవ్‌రామ్ ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి రాముడు మృతదేహానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం, భూమా కుటుంబ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.

'రైతుల పక్షాన నిలిచేది భూమా కుటుంబమే'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రైతుల పక్షాన నిలిచేది, వారి సమస్యల పరిష్కారానికి పోరాడేది ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భూమా కుటుంబమేనని టీడీపీ పట్టణ నాయకుడు సింగం భరత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ హుసేన్ బాషా అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి పబ్లిసిటీ పిచ్చి కోసం, గంగుల కుటుంబ మెప్పు, వారి నుంచి వచ్చే ప్యాకేజి కోసం సోషల్ మీడియాలో ఎమ్మెల్యే అఖిలప్రియపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఏమాత్రం సహించేది లేదన్నారు. కార్యక్రమంలో దొర్నిపాడు టీడీపీ నాయకుడు సిద్ధి సత్యం, మాజీ జడ్పీటీసీ చాంద్ బాషా, పత్తి పాపిరెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దాత షబ్బీర్ అహ్మద్

చాగలమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామ సమీపంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని పులి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలను శుక్రవారం దాత, పారిశ్రామిక వేత్త ముల్లా షబ్బీర్‌అహ్మద్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.25 వేలు, మూడవ బహుమతి రూ.15 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు నగదును దాతలు చక్రం బీడీ షబ్బీర్, పరమేశ్వర్‌రెడ్డి, మహమ్మద్‌రఫి, రామకృష్ణ, మహబూబ్‌బాష అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరసింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, రామ నరసింహారెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరలు తినాలి

కోవెలకుంట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు బాగా తినాలని జిల్లా కంటి వైద్యాధికారి క్రిష్ణమోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సూచనలు, సలహాలు ఇచ్చారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు.

26న దేశవ్యాప్త ఆందోళన

కోవెలకుంట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ఆందోళన చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ కార్మిక సంఘాల, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక కోవెలకుంట్ల జూనియర్ కాలేజీ ఆవరణంలో కరపత్రాలను విడుదల చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ శివబాలక్రిష్ణ, నాయకులు బాలసంజీవులు, అబ్రహాం, రామాంజనేయులు, నాగేంద్ర, బాషా,ఓబులమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె , నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీనాయకుడు, సర్పంచ్ తులసిరెడ్డి కోరారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ మిట్టపల్లె, మజరా గ్రామమైన కాపులపల్లెలో చేయాల్సిన గ్రామీణ ఉపాధి పనులను గుర్తించినట్లు తెలిపారు. కొత్తగా జాబ్‌కార్డుల్లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ లక్ష్మయ్య, వడిసెల రామసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, యన్నం వెంకట సుబ్బారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

30న మాదిగల కార్తీక వనభోజనం

డోన్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో ఈ నెల 30న నిర్వహించనున్న మాదిగల కార్తీక వనభోజన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆహ్వాన కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటి సభ్యులు శ్రీరాములు, ఈశ్వరయ్య, ఎర్రగుడి కిష్టన్న, ఉంగరానిగుండ్ల రాముడు, శ్రీనివాసులు, గార్లపాటి మద్దిలేటి, మద్దిలేటి,విజయబాస్కర్, శివన్న పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరరీ మాత పల్లకీ సేవ

బనగానపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో కామేశ్వరమ్మ, పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి తిరుచ్చి వేడుకలు

బేతంచెర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామశివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం తిరుచ్చి వేడుకలు నిర్వహించారు. శుక్రవారం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రామాంజనేయులు, అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.